క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: జమిస్తాన్‌పూర్, సీతాఫల్‌మండి సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు బలరాం కాంపౌండ్, సంధ్య హోటల్, హెరిటేజ్ ప్రాంతాలు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు మధురానగర్, ఎస్ఆర్ ఆస్పత్రి, సంజీవపురం శ్రీనివాసనగర్ ప్రాంతాలు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు గాంధీ విగ్రహం, ఎంసీహెచ్ పార్కు, లైఫ్ స్ప్రింగ్ హాస్పిటల్, ఈ–సేవా, బొందలగడ్డ, బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రాంతాలు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.30 గంటల వరకు నామాలగుండ, పద్మ గ్యాస్, అన్నానగర్, కిందిబస్తీ, నెహ్రూ హైస్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

దేవాలయాల్లో రాజకీయాలు తగవు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా రాజకీయాలు చేస్తున్నారని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ ఆరోపించారు. గురువారం నిర్వహించిన కోటి కుంకుమార్చన పూజలకు తనను ఆహ్వానించలేదని, అధికారులు విధులు విస్మరించి రాజకీయాలు చేయడం తగదన్నారు. మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఇంటికెళ్లి ఆహ్వానం పలికారని అలాగే తాను కూడా ప్రజాప్రతినిధిననే విషయం విస్మరించి కనీసం సమాచారం కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. దీనిపై దేవాదాయ శాఖ కమిషనర్, మంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

బన్సీలాల్‌పేట్: పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశ పెట్టి 50 శాతం ఉన్న బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా బన్సీలాల్‌పేట్ డివిజన్ సీజీఓ టవర్స్ వద్ద బీసీ నేత బాలక్రిష్ణ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించడానికి వెంటనే రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. జనాభా ప్రకారం బీసీ రిజర్వేషన్లను 56 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ, కేంద్ర స్థాయిలో 2లక్షల కోట్ల బడ్జెట్‌తో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలన్నారు. రఘునాథ్ గౌడ్, రాములు, రామారావు, లక్ష్మణ్, రాజ శేఖర్, జగదీష్, పవన్‌పటేల్, నారాయణ, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, రవి ప్రసాద్, రమేష్, శ్రీమన్నారాయణ, శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

అభినందన



ఉస్మానియా యూనివర్సిటీ: విశ్రాంత అధ్యాపకులు ప్రొ.రామకృష్ణారెడ్డికి పద్మశ్రీ అవార్డు దక్కడం ఓయూకు చారిత్రక ఘట్టమని వీసీ ప్రొ.రవీందర్ అన్నారు. గురువారం ఓయూ వీసీతో పాటు ఇతర అధికారులు పద్మశ్రీ రామకృష్ణారెడ్డి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఘనంగా కోటి కుంకుమార్చన పూజలు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో గురువారం కోటి కుంకుమార్చన పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దంపతులు హాజరై జ్యోతి 108 కిలోల పసుపు కుంకుమను అందించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు, ప్రసాదాలను వారికి అందించారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా కోటి కుంకుమార్చన పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని ఆయన సూచించారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. లోక కల్యాణం, విశ్వశాంతి కోసం ఈ పూజలు చేపట్టడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈవో గుత్త మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఈ కోటి కుంకుమార్చన పూజలు జరుగుతాయని ప్రతి రోజు సుమారు 500 మందికి పైగా మహిళా భక్తులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి అరుణగౌడ్, ఆకుల రూప పాల్గొన్నారు.



చిన్నారులతో కలిసి జాతీయ జెండా ఎగురవేస్తున్న ఏఐసీసీ కోఆర్డినేటర్ దీపక్‌జాన్



కార్పొరేటర్లతో కలిసి జెండా ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు



జాతీయ జెండాను అవిష్కరిస్తున్న మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి

జన గణ మన..

• ఘనంగా గణతంత్ర వేడుకలు • రెపరెపలాడిన జాతీయ జెండాలు • అబ్బురపరిచిన విన్యాసాలు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో జాతీయజెండాలు రెపరెపలాడాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జాతీయ జెండాలను ఎగరవేసి దేశభక్తిని చాటుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వారి వారి కార్యాలయాల్లో జెండాలు ఎగరవేసి స్వీట్లు పంచిపెట్టారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చినవారికి ప్రశంస పత్రాలు, బహుమతులు అందజేశారు. రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్ కమాండోలు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి.

–సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



జెండాకు వందన సమర్పణ చేస్తున్న వీసీ ప్రొ.రవీందర్



ఓయూ మోడల్ హై స్కూల్‌లో జెండా ఆవిష్కరిస్తున్న స్పెషల్ ఆఫీసర్ ప్రొ.శంకర్



గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ కంది శైలజ



బేగంపేట్ పాటిగడ్డలో జాతీయ జెండా ఎగురవేసిన కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి



కేఎల్ఎన్‌వై పార్కులో అసోసియేషన్ నాయకులు



రెజిమెంటల్‌బజార్‌లో కార్పొరేటర్ కొంతం దీపిక



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



జెండాను ఆవిష్కరిస్తున్న క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జెండా ఎగురవేసిన మెంబర్ వెల్లాల రామ్మోహన్



జెండా వందనం చేస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి



జెండా ఎగురవేస్తున్న మన్నే క్రిశాంక్, జంపన ప్రతాప్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కాకతీయ హైస్కూల్ ప్రిన్సిపల్ హరిలక్ష్మణ్



పద్మారావునగర్ పార్కు వద్ద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



మెక్లోడ్‌గూడలో కార్పొరేటర్ చీర సుచిత్ర జెండా ఆవిష్కరణ



గణతంత్ర ఉత్సవాల్లో కళాసీగూడలో మాజీ కార్పొరేటర్ శీలం ప్రభాకర్



స్టేషన్ ఎదురుగా జరిగిన ఉత్సవాల్లో ఎస్సై శ్రీధర్



గణతంత్ర వేడుకలో పాల్గొన్న ఎయిర్‌మార్షల్ చంద్రశేఖరన్



మడ్‌ఫోర్ట్ హట్స్‌లో గుడిసెవాసులతో కలిసి జెండా ఆవిష్కరిస్తున్న శ్రీగణేష్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, వైద్యులు



అమీర్‌పేటలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ సరళ



త్రివర్ణ అలంకారంలో బేగంపేట ప్రకాష్‌నగర్ భూలక్ష్మీ అమ్మవారు

అనాథల సమస్యలపై దృష్టి సారించాలి

బౌద్ధనగర్: తల్లితండ్రులేని అనాథ పిల్లల సమస్యలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుల మందకృష్ణ మాదిగ కోరారు. గురువారం పార్శిగుట్ట కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాథపిల్లలకు ఇప్పటి వరకు రాజ్యాంగ ఫలాలు అందలేదన్నారు. దేశంలో సుమారు 4 కోట్ల మంది, తెలంగాణలో 6లక్షల మంది అనాథులు ఉన్నారని వీరికి కనీసం అనాథ అనే గుర్తింపు కార్డు లేకపోవడంతో వారికి ఎలాంటి రిజర్వేషన్ దక్కక వెనుకంజలో ఉన్నారన్నారు. ఈ నెల 30న ఇందిరాపార్కు వద్ద అనాథల అరిగోస పేరుతో మహాదీక్ష చేపడుతామన్నారు. పరేడ్ గ్రౌండ్ మైదానంతో పాటు మొన్న మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి వినతి పత్రాలు



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఇవ్వటానికి వెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకులపై బీజేపీ నాయకులు దాడి చేయటం హేయమైన చర్య అని దాడులకు ప్రతిదాడులు తప్పకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అనాథ హక్కుల పోరాట వేదిక అధ్యక్షులు వెంకటయ్య, రాజు, తీగల ప్రదీప్ గౌడ్, గోవీంద్, రాగటి సత్యం, విజయ రావు, రాజు, డప్పు మల్లికార్జున్ పాల్గొన్నారు.

కార్పొరేట్ వ్యక్తుల కోసమా రాజ్యాంగ మార్పు?

లాలాపేట: కార్పొరేట్ వ్యక్తుల కోసమే భారత రాజ్యాంగాన్ని మార్చాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొ. ఇటికాల పురుషోత్తం అన్నారు. గురువారం తార్నాకలోని టీజేఏసీ కార్యాలయం వద్ద జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని మార్చడం కాదు.. ఆ రాజ్యాంగాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసి నిమ్నజాతుల అభివృద్ధికి పాటు పడాలని డిమాండ్ చేశారు. కానీ నేటి ప్రభుత్వాలు బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పని చేయకుండా కార్పొరేట్ శక్తుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారి కార్మికులు, కర్షకులు, రైతులకు రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారని విమర్శించారు. దేశంలోని ప్రజలందరికి ఉచితంగా విద్య, వైద్యం అందించేలా కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వేణు, శ్రీనివాసరావు, సత్యం, శ్రీరాంశివకుమార్, నాగయ్య పాల్గొన్నారు.

పునర్జన్మ ప్రసాదించే ఆయుధం సీపీఆర్

గాంధీఆస్పత్రి: హార్ట్ ఎటాక్ సర్వసాధారణంగా మారిన ఈ రోజుల్లో ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి కార్డియోపల్మనరీ రిసక్టేషన్ (సీపీఆర్) ద్వారా పునర్జన్మ ప్రసాదించవచ్చని వైద్యనిపుణులు సూచించారు. గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్నీ అసోసియేషన్, గ్లోబల్ అలియన్స్, అమెరికన్ హార్ట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సీపీఆర్ అవగాహన శిబిరం గురువారం ప్రారంభమైంది. గుండెపోటు మరణాలను నియంత్రించేందుకు సీపీఆర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, రవీందర్ సురకంటి, కొల్లిపర రాజశేఖర్, డెన్నిస్‌మెకాలీ, ప్రతాప్‌రెడ్డి, జనహిత సేవ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

రసూల్‌పురా: మత్తు పదార్థాలకు అలవాటైన యువకుడిని రిహాబ్‌సెంటర్‌లో చేర్పించగా తీవ్ర ఒత్తిడికి గురై బాత్రూమ్‌లో ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుమలగిరి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. అమ్ముగూడకు చెందిన కేవిన్ (21) గత కొన్ని సంవత్సరాలుగా మత్తు పదార్థాలకు బానిసగా మారడంతో తల్లి సంవత్సరం క్రితం తిరుమలగిరి పీఎస్ పరిధిలోని గాంధీనగర్‌లో కొనసాగుతున్న రిహబిలిటేషన్ సెంటర్‌లో చేర్పించింది. గురువారం కెవిన్ బాత్రూంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

ఓయూలో రాణి గైడిన్లుయా జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఆదివాసీల నేత రాణి గైడిన్లుయా జయంతిని గురువారం ఓయూలో ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆదివాసీ స్టూడెంట్ ఫోరం (ఏఎస్ఎఫ్) రాష్ట్ర నాయకులు సాగబోయిన పాపారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాణి గైడిన్లుయా చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడారు. నాగా జాతికి చెందిన రాణి గైడిన్లుయా ఆదివాసీల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి దేశ తొలి ప్రధాని నెహ్రూ ప్రశంసలు పొందారన్నారు. ఆమె సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో పాటు శతజయంతిని పురస్కరించుకొని పోస్టల్ స్టాంప్‌ను ముద్రించి ప్రత్యేక గౌరవాన్ని అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సుధీర్, అజయ్, రాంబాబు, వివేక్‌వర్ధన్, దేవేందర్, స్వప్న, కృష్ణవేణి, నాగమణి, కళ్యాణి, రాజీవి, భావన, రమ్య పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

తప్పుడు రిపోర్టు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

అమీర్‌పేట: తప్పుడు రిపోర్టు ఇచ్చి అబార్షన్‌కు కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ఏవీబీపురంకు చెందిన 27 ఓ గర్భవతి వైద్య పరీక్షల నిమిత్తం మధురానగర్‌లోని ఉమా క్లినిక్‌కు వెళ్లింది. పరీక్షించిన డాక్టర్ మాధవి స్కానింగ్ చేయించాలని అమీర్‌పేటలోని రేడియన్స్ డయోగ్నోస్టిక్ సెంటర్‌కు పంపింది. స్కానింగ్ చేసి ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ ఉందని చెప్పడంతో మళ్లీ డాక్టర్ వద్దకు వెళ్లి రిపోర్టు చూపించింది. కడుపులో ఒక చోట ఉండాల్సిన పిండం మరో చోట ఉందని.. దీనివల్ల ప్రాణాలకే ప్రమాదమని చెప్పి విజయ ఆసుపత్రికి తరలించింది. అబార్షన్ కోసం ఓ ఇంజెక్షన్ చేసి రెండు రోజులు అక్కడే పెట్టుకున్నారు. అయినా అబార్షన్ కాకపోవడంతో అనుమానం వచ్చి వేరేచోటకు వెళ్లి మరోసారి స్కానింగ్ చేసుకుంటే ఎక్టో ప్రెగ్నెన్సీ లేదని అక్కడి వైద్యులు తేల్చి చెప్పారు. అప్పటికే ఇంజక్షన్ చేయడంతో అబార్షన్ అయ్యింది. తప్పుడు రిపోర్టు ఇచ్చి అబార్షన్ కారణమైన వ్యక్తులకు చర్యలు తీసుకోవాలని పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379